ప్రజాశక్తి
బుధవారం 1 నవంబర్ 2023 5 విజయనగరం



జూనియర్ డాక్టర్ల ఆందోళన

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా సర్వజన ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. కర్రలు పట్టుకుని ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. శిక్షణలో ఉన్న హౌస్ సర్జన్ డాక్టర్ పి.సువర్ణ రాజు సోమవారం రాత్రి ఆసుపత్రిలో రోగులకు చికిత్స చేస్తున్న సమయంలో రోగులకు సంబంధించిన సహాయకులు ఎక్కువమంది ఉండడంతో డాక్టర్ సువర్ణ రాజు బయటకు వెళ్లాల్సిందిగా అక్కడ ఉన్న రోగుల సహాయకులకు సూచించారు. దీంతో ఓ రోగికి సంబంధించిన సహాయకుడు డాక్టర్ రాజుపై భౌతికంగా దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో డాక్టర్ రాజు కంటిపై గాయమైంది. ఈ దాడికి నిరసనగా జూనియర్ డాక్టర్లు మంగళవారం ఉదయం జిల్లా సర్వజన ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టి, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొక్కు తీర్చుకుంటున్న మహిళ

సిరిమానోత్సవానికి హాజరైన జనం

పైడితల్లమ్మ ఆలయానికి ఘటాన్ని తీసుకొస్తున్న చిన్నారి

అంబరాన్నంటిన సిరిమాను సంబరం

- లక్షలాది మంది హాజరు
- పైడితల్లమ్మ దర్శనానికి పోటెత్తిన జనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స
- అమ్మవారిని దర్శించుకున్న ఐటి మంత్రి అమర్‌నాథ్, ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యేలు

సిరిమానుకు దండం పెడుతున్న మంత్రులు బొత్స, అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఉత్సవాన్ని మంగళవారం జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ఎప్పటిలాగే పాలధార, అంజలి రథం, తెల్లఏనుగు, బెస్తవారి వల ముందు నడవగా, పైడితల్లి ఆలయపూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానుపై ఆశీనులై మూడుసార్లు అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఊరేగారు. ఈ అపూర్వ ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించిన భక్తులు పరవశించిపోయారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

సిరిమానోత్సవం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 4.35గంటలకు ప్రారంభమైంది. హుకుంపేట నుంచి సిరిమాను తరలింపు ఆలస్యం కావడంతో పాటు రథాన్ని సిద్ధం చేయడంలో ఆలస్యం కావడంతో గంటన్నర ఆలస్యంగా ఉత్సవం ప్రారంభమైంది.

ఎస్‌పి ఎం.దీపిక, కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆర్‌జెడి సురేష్‌బాబు, ఆర్‌డిఒ సూర్యకళ తదితరులు సిరిమాను ముందు నడిచారు. అత్యంత ఘనంగా జరిగిన అమ్మవారి సిరిమానోత్సవం సాయంత్రం 6 గంటలకు ముగిసింది.

ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేసిన అధికారులు అందుకు తగినట్టు బందోబస్తును, మూడు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి గంటస్తంభం, బాలాజీ జంక్షన్, గుమ్చీ, అంబటిసత్రం నుంచి ఆలయం వైపు వాహనాలు వెళ్లకుండా నిలుపుదల చేశారు. మధ్యాహ్నం 1గంట వరకు దర్శనాలకు అవకాశం కల్పించారు. నగర ప్రజలే కాకుండా జిల్లా వ్యాప్తంగా వచ్చిన వేలాది మంది అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయం కల్పించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా తాగునీరు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.

సిరిమానోత్సవాన్ని తిలకించిన ప్రముఖులు

సిరిమానోత్సవాన్ని పలువురు ప్రముఖులు ప్రత్యక్షంగా తిలకించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబం ఆశీనులై ఉత్సవాన్ని తిలకించింది. ఆయనతో పాటుగా రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, కంబాల జోగులు ఇతర ప్రముఖులు, అధికారులు సైతం ఇక్కడినుంచే ఉత్సవాన్ని తిలకించారు. మాన్సాస్ చైర్మన్, పైడితల్లి ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, వారి కుటుంబ సభ్యులు కోట బురుజు పైనుంచి సిరిమాను ఉత్సవాన్ని తిలకించారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పణ

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ నేపథ్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తన సతీమణి బొత్సఝాన్సీలక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త అశోక్ దంపతులు

అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పైడితల్లమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ, మంత్రి అమర్నాథ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, విశాఖరీజియన్ జిల్లా పరిశ్రమ్య, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని మన్సాస్ సంస్థచైర్మన్, టిడిపి పోలిట్‌బ్యూరో బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలాగజపతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనర్సయ్య, బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, సినీనటుడు సాయికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

కార్పొరేషన్ సేవలు భేష్

సిరిమానోత్సవం సందర్భంగా కమిషనర్ శ్రీరాములు నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు ఆధ్వర్యాన అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మెరుగైన సేవలు అందించారు. సిరిమానుపై భక్తులు విసిరిన అరటిపండ్లు, తదితర వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు. తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు.

పలు శాఖల సమిష్టి కృషి

ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, పైడితల్లి ఆలయ ఇఒ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ ఆర్. శ్రీరాములునాయుడు, ఇతర అధికారులు, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, ఆర్అండ్‌బి, పైడిమాంబ దేవస్థానం, వైద్యారోగ్యశాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ, ట్రాన్స్‌కో తదితర సుమారు 25 ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బంది సమన్వయంతో కృషి చేసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. వీరిని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన భక్తులకు, ప్రజలందరికీ కలెక్టర్ కతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ అందించిన సేవలు ప్రశంసలను అందుకున్నాయి.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక

ఐరావతం

అంజలిరథం

బెస్తవానివల

సాలూరులో రక్షణభేరి నాయకులకు తిలకందిద్ది స్వాగతం పలుకుతున్న మహిళ

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజా రక్షణ భేరికి అపూర్వ ఆదరణ

- సిపిఎం నాయకులకు ఎక్కడికక్కడ హారతులతో స్వాగతం
- పలు సమస్యలపై వినతుల వెల్లువ
- కొండకోనలు దాటుకుంటూ తరలివచ్చిన గిరిజనులు
- సమస్యలపై పోరాడేందుకు అభయమిచ్చిన నేతలు
- యాత్రలో ఆలోచింపజేసిన కళా ప్రదర్శనలు

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పిఎన్ఎం కళాకారుడి డప్పు ప్రదర్శన

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి/సాలూరు, సీతానగరం, మక్కువ

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు రోజులపాటు సాగిన ప్రజారక్షణ భేరీ బస్సుయాత్రకు విశేష ఆదరణ లభించింది. దారిపొడవునా మహిళలు హారతులిచ్చి, పూలతో స్వాగతం పలికారు. నాయకులకు తిలకం దిద్దుతూ ఆప్యాయతగా పలకరించారు. కురుపాం, మక్కువ, సాలూరు, మెంటాడల్లో జరిగిన సభలకు గిరిజనులు కొండకోనలు దాటుకుంటూ తరలివచ్చారు. సుమారు 20 కిలోమీటర్ల దూరంలోనున్న మక్కువ మండలం కాముడు వలస నుంచి మూడు నెలలు, ఏడాది చంటి బిడ్డలను ఎత్తుకుంటూ మక్కువలో జరిగిన సభకు కాలినడకన రావడం ఎర్రజెండాపై వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. యాత్ర సాగిన ప్రతిచోటా స్థానికులు డప్పుల దరువు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఎర్రజెండా చేతబూని రెపరెపలాడించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున చేసిన నినాదాలు మిన్నంటాయి. యాత్రలో పాల్గొన్న నాయకులు కూడా రాత్రి పూట గ్రామాల్లోనే బస చేస్తూ స్థానికులతో మమేకమై కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ యాత్ర రథసారధి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వివిధ తరగతులవారు వినతులు అందజేశారు. వీటిని స్వీకరించిన ఆయన పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామని, అవసరమైనప్పుడు ప్రజాక్షేత్రంలో పాలకపార్టీలను ఎండగట్టేందుకు ప్రజలు కూడా సిద్ధపడాలని కోరారు.

రెండో రోజు యాత్ర సాగిందిలా..

రెండో రోజు ప్రజా రక్షణ భేరి యాత్ర సీతానగరం మండలం చినబోగిలి, మక్కువ, సాలూరు మీదుగా మెంటాడ మండల కేంద్రం వరకు సాగింది. చినబోగిలి ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి స్థానిక ప్రజలు ప్రదర్శనతో స్వాగతం పలికారు. సాలూరులో గాంధీనగర్ జంక్షన్ వద్ద బస్సు యాత్రలో వున్న నాయకుల బృందానికి నియోజకవర్గ సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా బోసుబొమ్మ జంక్షన్ వరకు, మెంటాడ ముఖ ద్వారం నుంచి ప్రధాన రహదారి చివరి వరకు డప్పువాయిద్యాల నడుమ ప్రదర్శన చేపట్టారు. చినబోగిలిలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, మక్కువలో సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి ఇందిర, సాలూరులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అప్పారావు, మెంటాడలో విజయనగరం జిల్లా పార్టీ కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన సభలు జరిగాయి.

సాలూరులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలి : విఎస్ఆర్

సాలూరులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. లారీ రవాణా రంగంలో విజయవాడ తరువాత అంతటి సంఖ్యలో లారీలు ఉన్న సాలూరులో కనీస సదుపాయాలు కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు. మెకానిక్ వర్కుషాపులు, టైర్లు తదితర సామగ్రి అందుబాటులో ఉండే విధంగా సాయపడాలని లారీ ఓనర్లు చాలా కాలంగా కోరుతున్నా పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. దీనికితోడు కేంద్రం అనుసరిస్తున్న మోటార్ వాహన చట్టాల వల్ల కూడా యజమానులు ఆర్థికంగా కుదేలవుతున్నారని తెలిపారు. దీంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లు కూడా ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆటోనగర్ కోసం భూమి సేకరించినప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదని విమర్శించారు. మూతపడి వున్న జీగిరాం జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. రూ.4కోట్ల ఖర్చుతో 9వేల ఎకరాలకు సాగునీరందించే గుర్ల గెడ్డ ప్రాజెక్టును పాలకులు గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా దీన్ని పూర్తిచేయకపోతే ప్రభుత్వ భరతం పడతామన్నారు. మెంటాడ మండలంలో అనేక గ్రామాల్లో తాగునీటి సదుపాయం కూడా కల్పించకపోవడం వల్ల గిరిజనులకు ఊటనీరే గత్యంతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చెరకు రైతులకు మోసం : ఎంఎస్

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి చెరకు రైతుల్ని మోసం చేసిందని విమర్శించారు. లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని నిలదీస్తే, కమిషన్ల కోసం ఆ ఫ్యాక్టరీ భూములు విక్రయించారని అన్నారు. అంతకు ముందు కూడా రూ.150కోట్ల విలువగల ఈ ఫ్యాక్టరీని ఎన్‌సిఎస్ యాజమాన్యానికి రూ.13కోట్లకు కట్టబెట్టిందని గుర్తు చేశారు.

అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు తదితర స్కీమ్ వర్కర్లపై పనిభారం పెంచినప్పటికీ, వేతనాలు పెంచలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ విమర్శించారు. 95శాతం హామీలు అమలు చేసినట్టు చెప్పుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి వేతనాల పెంపు విషయమై అంగన్‌వాడీలకిచ్చిన మాట ఎందుకు తప్పారని ప్రశ్నించారు. న్నికల్లో ఓట్లు దండుకోవడానికే వైసిపి సామాజిక సాధికారిక యాత్ర చేపట్టిందన్నారు. వైసిపితోపాటు టిడిపి, జనసేన కూడా బిజెపి ఏం చేసినా తానా అంటే తందాన అంటూ కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. మోడీ, జగన్ అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగ, ఉపాధిని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జీగిరాం జ్యూట్ మిల్లు కార్మికులు, అంగన్‌వాడీలు, సాలూరు, మక్కువ, మెంటాడ మండలాలకు చెందిన గిరిజనులు, గుర్లగెడ్డను పూర్తిచేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలంటూ రైతులు యాత్రకు నాయకత్వం వహిస్తున్న శ్రీనివాసరావుకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఎన్‌వై నాయుడు, సీదరపు అప్పారావు, విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులు దోపిడీకి గురవుతున్నారని, తాగడానికి మంచినీరు కూడా వైసిపి ప్రభుత్వం అందించడం లేదన్నారు. కనీస సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గిరిజనులకు ప్రాతినిద్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈ బురద నీరు తాగ గలరా అని ప్రశ్నించారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేయకుండా విశాఖ నుంచి రాయపూర్‌కు వేల కోట్లు పెట్టి రోడ్డు వేస్తున్నారని అన్నారు.

సీనియర్ నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 80 వేలతో పేదలు ఎలా ఇళ్లు కడతారని ప్రశ్నించారు. కనీసం యూనిట్ విలువ ఐదు లక్షల రూపాయలు వుండాలన్నారు. కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఆరు లక్షల రూపాయలతో ప్రభుత్వమే పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతోందని చెప్పారు. వైసిపి ఎమ్మెల్యేలు మంత్రులు భూములు, ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.



వినతులు స్వీకరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

మెంటాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, శ్రేణులు

పైడితల్లమ్మ జాతర చిత్రమాలిక


పైడితల్లమ్మను దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

దర్శనానికి వస్తున్న ఎమ్‌పి బెల్లాన కుటుంబ సభ్యులు

ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పైడితల్లమ్మ ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్న ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు

సిరిమానోత్సవాన్ని వీక్షిస్తున్న మంత్రులు బొత్స, గుడివాడ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కలెక్టర్

సిరిమానోత్సవాన్ని పర్యవేక్షిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పైడితల్లమ్మ దర్శనం కోసం క్యూలో నిలబడిన యాత్రికులు


కోట పైనుంచి సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు

మజ్జిగ పంపిణీ చేస్తున్న పైడితల్లమ్మ ఆలయ ఈవో సుధారాణి

దర్శనానికి వచ్చిన సినీ నటుడు సాయికుమార్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

సిరిమానోత్సవంలో సన్నాయి మేళం

సిరిమానోత్సవంలో పాలధార

పులివేషధారణ

ఘనంగా దుర్గాలమ్మ పండగ

దెంకాడ : మండలంలోని కొండరాజుపేట గ్రామంలో దుర్గాలమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని పసుపు కుంకుమలతో పూజించారు. సర్పంచ్, మాజీ సర్పంచ్ సరగడ కళ్యాణి, బంగారు రెడ్డి గ్రామ పెద్దల సహకారంతో ఈ పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. **నెల్లిమర్ల :** మండలంలోని సారిపల్లి గ్రామంలో వెలసిన పైడితల్లమ్మ జాతర మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పూజారి కిలారి సతీష్ దర్శనాలు చేయించారు. ప్రతి సంవత్సరం విజయనగరం పైడితల్లమ్మ జాతర రోజు ఇక్కడ జాతర జరగడం విశేషం.

పాటూరు ఫీల్డ్‌అసిస్టెంట్‌పై మళ్లీ విచారణ

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌పై సోమవారం మళ్లీ విచారణ చేపట్టారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌పై గతంలో ఫిర్యాదులు అందడంతో రెండుసార్లు విచారణ చేశారు. కాని ఆరోపణలు రుజువు కాలేదు. సోమవారం మరోసారి ఎపిడి శారద, ఏపిఒ ఆదిలక్ష్మి విచారణ నిర్వహించారు. గ్రామంలో వివాదాలు సృష్టించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ రమణమూర్తి అధికారులకు వివరించారు.

బాల్య వివాహాల ప్రోత్సాహం నేరం

రామభద్రపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వాటిని ప్రోత్సహించ రాదని రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జెసి రాజు పిలుపునిచ్చారు. నాయుడువలస గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్యవివాహాలు నిర్మూలించాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను చదవాల్సిన వయసులో వివాహాలు చేయటం వారి జీవితాలను సమస్యల్లోకి నెట్టటమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు వేణు, రవి, కృష్ణం నాయుడు, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ

బొబ్బిలి: తైక్వాండో బెల్ట్ టెస్ట్ పోటీలలో బొబ్బిలి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజయనగరంలో జరిగిన బెల్ట్ టెస్ట్ పోటీలలో బొబ్బిలికి చెందిన పోల ఈక్షణ, ఎం.శ్రీకర్ యాదవ్, ఎన్. పార్థసారథి బ్లాక్ బెల్ట్ సాధించారు. వీరిని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన మంగళవారం అభినందించారు. చదువుతోపాటు క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలని బేబినాయన కోరారు. కార్యక్రమంలో కోచ్ సుధాకర్ పాల్గొన్నారు.


పోల ఈక్షణను అభినందిస్తున్న బేబినాయన

రిక్షాలకు టాపులు కుట్టించిన రోటరీ క్లబ్

బొబ్బిలి: ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రిక్షాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో టాపులు కుట్టించారు. రిక్షాలకు టాపులు లేకపోవడంతో కార్మికులు వర్షాలకు తడిస్తూ, ఎండలకు ఎండుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రిక్షా కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు టాపులు ఏర్పాటు చేశామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, వారాణసి శ్రీహరి, కోశాధికారి శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాస్, పాల్గొన్నారు.

సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలి

మెరక ముడిదాం: మండలంలోని అన్ని రేషన్ షాపులు ద్వారా నిత్యావసర సరుకులను ఎండియు ఆపరేటర్లు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ విజయ్ భాస్కర్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో ఇంచార్జి సిఎస్‌డిటి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ నుండి సరుకులు విడిపించి, ఎండియు ఆపరేటర్ల ద్వారా లబ్దిదారులకు అందే విధంగా డీలర్లు బాధ్యత వహించాలన్నారు. గ్రామంలో ఏ ఒక్కరి దగ్గర నుండి మాట రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సమావేశంలో డీలర్ల యూనియన్ ప్రెసిడెంట్ జయ సింహనాయుడు, బూర్లె వెంకటప్పలనాయుడు, డీలర్లు పాల్గొన్నారు.

బాధితులకు దుప్పట్లు పంపిణీ

విజయనగరం: రైలు ప్రమాదంలో గాయపడి, జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. హాస్పిటల్ ఆర్ఎంఒ సురేష్ బాబు పాల్గొని, సామాజిక బాధ్యతతో సహాయాన్ని అందించిన విజ్ఞాన కేంద్రం నిర్వాకులను అభినందించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు, కార్యదర్శి సతీష్, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, తిరుపతి నాయుడు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

భోగాపురం: క్షతగాత్రులకు ఆసుపత్రిలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని జనసేన సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్ లోకం మాధవి అన్నారు. రైలు ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అయితే వారికి అందించాల్సిన సౌకర్యాలను సక్రమంగా అందించడం లేదని అన్నారు. ఈ సందర్భంగా బాధితులకు దుప్పట్లు, పండ్లుతో పాటు వివిధ రకాల వస్తువులను ఆమె పంపిణీ చేశారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్నజివికె నిర్వాహకులు

మరో అవకాశమివ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గడగడపకు కార్యక్రమం పేరుతో ప్రజల మధ్యనే ఉన్నామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే కార్యక్రమం చేపట్టామన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలం మళ్లీ అభివృద్ధి చెందాలంటే ఈ ప్రభుత్వమే మనకు అవసరమని అన్నారు. సవరవల్లి పంచాయతీపై ఎమ్మెల్యేకు ఎనలేని అభిమానమన్నారు. అందుకు ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడ అనూరాధరెడ్డి, సవరవల్లి సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి ఎంపిటిసి పట్నా తాతయ్యలు, ఎంపిడిఒ అప్పలనాయుడు, వైద్యాధికారి తిరుపతిస్వామి, నాయకులు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, అప్పురభుక్త పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.


భోగాపురం: మండలంలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

460 మందికి ఆరోగ్య తనిఖీలు

కొత్తవలస: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని కొత్తవలస -5 సచివాలయంలో గల రాజపాత్రునిపాలెం, చీపురువలస, ఎర్రవాణిపాలెంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెగా వైద్యశిబిరంలో 460 మందికి తనిఖీలు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ డి.సీతల్ వర్మ తెలిపారు. సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ సెక్రటరీ ఇ.కన్నబాబు తెలిపారు. ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యకి, వైద్యానికి పెద్ద పీటవేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు వైస్ ఎంపిపి కర్రి శ్రీను, అయ్యారకాల పాత్రుని డైరెక్టర్ రామన్న పాత్రుడు, ఎంపిడిఒ వై. పద్మజ, ఇఒపిఆర్‌డి ధర్మారావు, నాయకులు బాలరాజు, ఏడుకొండలు, సూరిబాబు, వైద్యులు సింహాద్రినాయుడు, జ్యోతిర్మయి, మాధురి సుధ, రామలక్ష్మి, ఈశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహ'దారి' కష్టాలు

• పాలకొండ- రాజాం రోడ్డులో కూరికిపోయిన లారీలు • కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- రేగిడి

రాజాం-పాలకొండ ప్రధాన రహదారిలో రాజాం అంబేద్కర్ జంక్షన్ నుంచి జిఎంఆర్ ఐటి మధ్య డోలపేట వద్ద రెండు లారీలు కూరికి పోవటంతో ప్రయాణికులకు నడక కష్టాలు తప్పలేదు. ఒకే ప్రాంతం వద్ద రెండు లారీలు గుంతలలో కూరికిపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర రైలు బోగీలు వలె వాహనాలు దర్శనమిచ్చాయి. వృద్ధులు, చిన్నారులు జిఎంఆర్‌ఐటి నుంచి కాంప్లెక్స్ వరకు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లడంతో నానా అవస్థలు పడ్డారు. ఇంత జరిగినా పోలీసులు జాడా లేదని ప్రయాణికులు విమర్శించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే నాధుడే కరవయ్యారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రధాన రహదారిలో కాలువ పనులు చేపట్టడం, రోడ్డుకి ఇరువైపులా ఉన్న కట్టడాలను తొలగించి రోడ్డుపైన పడి వేయడం, కాలువ నుంచి వచ్చే నీరు నిలిచిపోవడంతో వాహనాలు కూరుకుపోయాయి. ఆరు రోజులు క్రితం భారీ వాహనం డోలపేట వద్ద ఇలానే గుంతలో కూరుకుపోవడంతో ఇదే పరిస్థితి నెలకొంది. గత మూడు నెలలు నుంచి పనులు జరిగిన ట్రాఫిక్ కమిషనర్, పోలీస్ శాఖ పట్టించుకోకపోవడంతో మంగళవారం నాటి పరిస్థితితో బారీ మూల్యం చెల్లించుకోవలసిన వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో సుధీర ప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులు నడుచుకొని వెళ్లి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రధాన రహదారిలో ఉన్న శిధిలాలను తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

కూరుకుపోయిన లారీను జెసిబితో తొలగిస్తున్న డ్రైవర్

చంద్రబాబు విడుదలపై హర్షం

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చెయ్యడంతో ఒక్కసారిగా టిడిపి శ్రేణుల్లో హుషారు పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ టిడిపి నాయకులు ఆనందోత్సవాలు నిర్వహించుకున్నారు.

ప్రజాశక్తి- రేగిడి

చంద్రబాబు విడుదలపై రాజాం పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం టౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ ఆధ్వర్యంలో బాణాసంచా కాలుస్తూ, రోడ్డుపై డాన్స్ లు వేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు టంకాల కన్నం నాయుడు, పిల్లా సత్యం నాయుడు, పొట్నూరు సోమశేఖర్, మరిపి జగన్, ఆటో కోటి తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** చంద్రబాబు బెయిల్‌పై విడుదల కావడం ఆనందంగా ఉందని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు. నేడు ఎస్‌కోటలోని ఆకుల డిపో వద్ద టిడిపి, జనసేన ఆత్మీయ సమ్మేళన సమావేశానికి మండలం నుంచి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. **విజయనగరం:** చంద్రబాబుకి మధ్యంతర బెయిల్ లభించడం ప్రజాస్వామ్య విజయమని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకి మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం సంతోషకరమన్నారు. **బొబ్బిలి :** చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో కోటలో మంగళవారం టిడిపి నాయకులు బేబినాయన ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. **బాడంగి :** మండలంలోని ఎరుకుల పాకలు గ్రామంలో మంగళవారం రాత్రి ఎంపిటిసి, రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. **విజయనగరం:** చందబాబుకు బెయిల్ సందర్భంగా జిల్లా కేంద్రంలో టిడిపి నాయకులు బాణాసంచా కాలుస్తూ, డ్యాన్సులు చేస్తూ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, ఐవిపి రాజు, బొద్దల నరిసింగరావు, ప్రసాదుల లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. **ఎస్‌కోట:** స్థానిక దేవి గుడి ప్రాంగణం వద్ద టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్లలితకుమారి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బాణాసంచ కాల్చి సంబరాలు జరుపుకున్నారు. దీనికి ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎ.టి. అగ్రహారంలో డయేరియా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఏటి అగ్రహారంలో డయేరియా ప్రబలింది. గత మూడు రోజులుగా గ్రామస్తులు వాంతులు విరోచనాలతో బాధ పడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 30 మంది డయేరియాతో స్థానిక సిహెచ్‌సి, మిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా గ్రామంలో పారిశుధ్యం లోపించినట్లు తెలిసింది. కాలువలు మురుగు, చెత్తతో నిండిపోయి దర్శనమిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా వైద్య సిబ్బంది తనిఖీలు చేసి సేవలు అందిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికార్లు ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆందోళన చెందుతున్నారు. డయేరియా పై టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, దన్నాన పేట మాజీ సర్పంచ్ గేదెల రాజారావు రామతీర్థం సచివాలయంలో వైద్యాదికార్లతో మాట్లాడి తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి డయేరియా నియంత్రించాలని డిమాండ్ చేశారు.

డయేరియా గురించి సిబ్బందితో చర్చిస్తున్న గేదెల రాజారావు

కషాయంతో దోమపోటు నివారణ

వేపాడ: వరి పంటలో ఉధృతంగా వ్యాపిస్తున్న దోమపోటు నివారణకు రైతులు తూటికాడ కషాయాన్ని స్ప్రే చేయాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.సన్యాసమ్మ కోరారు. మంగళవారం నీలకంఠ రాజపురం గ్రామంలోని రైతులతో తూటికాడ కషాయాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట కోత దశకు వస్తున్న తరుణంలో దోమపోటు ఎక్కువగా వస్తుందని తద్వారా వరి పంట మొత్తం మాడిపోతున్నందున దిగుబడి తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులందరూ తమ సిబ్బంది సూచనలు సలహాలు పాటించి సకాలంలో కషాయాలతోనే వరి పంటపై, వచ్చే తెగులు, పురుగులు నివారణకు రైతులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్ పి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

సాధన సభ్యుడు రక్తదానం

నెల్లిమర్ల: అత్యవసర పరిస్థితుల్లో జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యుడు రక్తదానం చేశాడు. మంగళవారం ఎస్.కోట కొలపతి నర్సింగ్ హోమ్‌లో టి.కళావతి అనే పేషంట్ గైనిక్ సమస్యతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అత్యంత అరుదైన బ్లడ్ గ్రూప్ ఏ పాజిటివ్ రక్త వర్గం 3 యూనిట్ల అవసరమైంది. దీంతో పేషంట్ బంధువులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించి సాధన యువజన సంఘం సభ్యుడు శరత్ కుమార్ విజయనగరం ఎన్‌వివిఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి రోగి బంధువులకు అందించాడు. రక్త దాతను రోగితో బాటు సాధన ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, ఎన్‌వివిఎన్ బ్లడ్ బ్యాంక్ ఇంఛార్జి నాగేశ్వర రావు అభినందించి జ్ఞాపికను అందించారు. సాధన అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, వినయ్‌లు అభినందలు తెలిపారు.

వికలాంగులకు సేవలందించిన పోలీసులు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

పైడితల్లమ్మ తొలేళ్ళు పండగను పురష్కరించుకుని మంగళవారం యాత్రికలకు సేవాదళ్ పోలీసులు విశేషమైన సేలందించారు. దర్శనానికి వచ్చిన వృద్ధులు, గర్భిణులు, వికలాంగులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా అవసరమైన సహాయ, సహకారాలను మహిళా పోలీసు స్టేషను ఎస్ఐ పి.శ్యామలాదేవి ఆధ్వర్యంలో సేవాదళ్ పోలీసు సేలందించారు. నడవలేని వికలాంగులను తమ భుజాలపై దర్శనానికి తీసుకొని వెళ్ళి, దర్శనం అయ్యే విధంగా చర్యలు చేపట్టారు. సేవలందించేందుకు వీల్ ఛైర్స్‌ను కూడా అందుబాటులో ఉంచారు.

వికలాంగుడును తీసుకెళ్తున్న పోలీసులు

మురుగు తొలగింపు

శృంగవరపుకోట: స్థానిక మహమ్మదీయుల గోరీ వద్ద కొన్ని నెలల క్రితం బిల్డర్ భవన నిర్మాణ మెటీరియల్ రవాణా కోసం గొల్లపాకలు నుండి ప్రవహించే మురుగు కాలువను తన ఇష్టారాజ్యంగా మూసివేశారు. దీంతో కాలువ సక్రమంగా ప్రవహించక వీధి దుర్గంధభరితంగా మారింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన ఇఒ కన్నబాబు ఎట్టకేలకు కాలువ నుండి రాళ్ళను, మట్టిని, గొట్టాలను తొలగించారు. ఇంకా గొర్రెల పెంటలను, మందలను తొలగించాల్సి ఉంది.

కళాకారులను ప్రోత్సహించాలి

బొబ్బిలి: బొబ్బిలి వీణలను తయారు చేస్తున్న కళాకారులను ఆదుకోవాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. వీణల కేంద్రాన్ని మంగళవారం సందర్శించి కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బొబ్బిలి వీణను ఒకే జిల్లా-ఒకే ఉత్పత్తి కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వీణల కేంద్రాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు.

మూడో లైన్ పునరుద్ధరణ

జామి : అలమండ రైల్వే స్టేషన్ సమీపంలోని భీమాలీ వద్ద రైలు ప్రమాదం జరిగిన 24 గంటల్లో రైల్వే శాఖ లైన్ పునరుద్ధరణ పనులను పూర్తి చేసింది. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి, సాధారణ స్థితికి ట్రాక్‌ను పునరుద్ధరించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకే మృత దేహాలు, బోగీ శకలాలు తొలగించారు. మూడు లైన్ల ట్రాక్‌లో సాయంత్రానికి రెండు ట్రాక్‌లు సాధారణ స్థితికి రాగా, కొన్ని రైళ్లు తిరగడం ప్రారంభించాయి. రాత్రి 10.30 గంటలకు మూడో లైన్ పనులు కూడా పూర్తి కావడం యధావిధిగా రైళ్లు తిరుగుతున్నాయి

పనులు పూర్తి చేయండి

బొబ్బిలి : పట్టణంలోని అగురువీధిలో పైపులైన్ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పైపులైన్ పనులకు నిధులు మంజూరు కావడంతో పైపులైన్ వేసే ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ఆయనతో కౌన్సిలర్ హైమావతి, డిఇ రవికుమార్ ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

మరో బాలుడిని కాపాడిన స్థానికులు

శృంగవరపుకోట: మండలంలోని వేములపల్లి వద్ద కోనేరులో ఈతకు వెళ్లి చప్ప సాయి(14) అనే బాలుడు మరణించగా ముని జయ చరణ్ అనే బాలుడిని స్థానికులు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం గ్రామానికి చెందిన రామారావుతో ఎస్ కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కోట లక్ష్మికి వివాహమైంది. వీరికి చెప్పా సాయి అనే 14 సంవత్సరాల ఒక్కగానొక్క బాలుడు ఉన్నాడు. దంపతులిద్దరూ తిరుపతి సమీపంలోని నాయుడుపేటలో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. సాయిని లక్ష్మి ధర్మవరంలో తన తండ్రి ఇంటి వద్ద ఉంచగా ఆ బాలుడు ఎస్ కోటలో ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పైడితల్లమ్మ పండగ సందర్భంగా మంగళవారం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో సాయి తన మిత్రుడు జయ చరణ్ మరో ఇద్దరితో కలిసి వేములపల్లి వద్ద ఉన్న కోనేరుకు ఈతకు వెళ్ళారు. వీరిద్దరూ కోనేరులో లోతుగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లడంతో ఇరువురు మునిగిపోయారు. గట్టుపై కూర్చున్న మరో ఇద్దరు స్నేహితులు కేకలు వేయడంతో వేములపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప మాల వేసుకున్న లగుడు యశ్వంత్ అనే యువకుడు కోనేరులో దిగి ముందుగా జయశంకర్‌ను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఆ వెంటనే వెళ్లి మునిగిపోయిన సాయిని కూడా ఒడ్డుకు తీసుకొచ్చాడు. ఇద్దరినీ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో సాయి మరణించాడు. జయ చరణకు కూడా ఊపిరితిత్తులలో నీరు చేరటంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన యువకుడు మృతి

భోగాపురం : కొట్లాట కేసులో తీవ్రంగా గాయపడిన మారుపల్లి చినరాము (20) విశాఖలోని కెజిహెచ్‌లో 13రోజులు పాటు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పెదకొండ్రాజుపాలెంలో పండగలు సందర్భంగా తోటపల్లి ప్రభుత్వ మద్యం షాపు వద్ద యువకుల మధ్య జరిగిన కొట్లాటలో కొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన చినరాముతో పాటు అమ్మోరుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో అమ్మోరు కోలుకోగా చినరాము కోమాలోకి వెళ్లి పోయాడు. చికిత్స అందించినప్పటికి తలపై బీరు సీసాతో బలంగా కొట్టడంతో బలమైన గాయం తగిలి చనిపోయాడు. ఈ కేసులో ఇప్పటికే ఇరువర్గాలకు చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసారు. ఇందులో ఒక రౌడీ షీటరు ఉండగా మరో ఇద్దరు మైనర్లు కూడా ఉండడం విశేషం. విశాఖ కె.జి.హెచ్ నుంచి చినరాము మృతదేహాన్ని మంగళవారం గ్రామానికి తీసుకువచ్చి అంతక్రియలు చేశారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. చినరాముకు తల్లీదండ్రులతో పాటు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వంగర: మండలంలోని నాగావళిలో శివ్వాం రేవు వద్ద నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను ఎస్ఇబి అధికారులు పట్టుకుని తమకు అప్పగించారని హెచ్‌సి దూసి రాములు మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆ ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.